

66
ధారావాహిక

# జాయ సేనాపతి

## చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ :** గురుకులం నుంచి బయల్దేరారు ఇంద్రాణి, జాయపుడు. ముందు పల్లకిలో ఇంద్రాణి.. వెనుక అశ్వంపై జాయపుడు. ఏదో ఆలోచిస్తూ వెళ్తున్న జాయపుణ్ని.. ఓ బిచ్చగాడి పాట ఆపేసింది. గుర్రం దిగి.. అతనికి నమస్కరించాడు. ఆ బిచ్చగాడు స్థాణువైపోయాడు. చూస్తున్న జనం కూడా ఆశ్చర్యపోయారు. వారిని పట్టించుకోకుండా.. ఆ బిచ్చగాణ్ని అక్కడున్న ఇంటి అరుగుపై కూర్చోబెట్టి, పక్కనే కూర్చున్నాడు. అతని చేతిలోని వాయిద్యాన్ని తీసుకుని.. పసిపాపలా ఒడిలో పెట్టుకుని పరీక్షించసాగాడు.

ఆ వాయిద్యాన్ని ఆమూలాగ్రం చూస్తూ.. ‘‘ఇది ఎవరు తయారుచేశారు? ఈ గుమ్మడి బుర్ర ఏమిటి?’’ అడిగాడు జాయపుడు.

‘‘ఏమో తెల్వదు దేవరా! మా నాయన నాకిచ్చిండు. ఈ గుమ్మడిబుర్ర పాడైపోతే మరోటి తగిలిస్తా! నే పాడుకుంటా, వాయించుకుంటా వీధులంట పోతుంటా.. జనమే నిలబెట్టి మరీ బియ్యం, అన్నం, కూరలు నా జోలెలో ఏస్తరు!’’ అని చెప్పాడు ఆ బిచ్చగాడు.

‘‘భలే భలే! వాయించు.. పాట పాడుతూ వాయించు..’’ అన్నాడు ఆ వాద్యాన్ని, దాని శబ్ద సౌందర్యాన్ని తీక్షణంగా పరిశీలిస్తూ జాయపుడు.

అతను పాడుతూ వాయిస్తున్నాడు. జాయపుడు కళ్లు మూసుకుని వింటున్నాడు.

అప్పుడో సంఘటన జరిగింది.

దూరంగా వీధి మలుపు వద్ద పల్లకి ఆగింది. ఇంద్రాణి దిగింది. దూరంగా జాయపుడు ఓ సాధారణ రెల్లుగడ్డి ఇంటి అరుగుపై ఓ బిచ్చగాడితో కూర్చుని కనిపిస్తున్నాడు. కొందరు సామాన్యులు వారిచుట్టూ మూగి ఉన్నారు. ఇంద్రాణి వేగంగా అక్కడికి రాబోయింది. మధ్యలోనే ఆగిపోయింది. చివ్వున వెనుదిరిగింది. పల్లకి అధిరోహించింది. పల్లకి ఆగకుండా ముందుకు సాగిపోయింది.. వేగంగా!

* * *

అశ్వాలపై జాయపుడు, లలితాంబ.. దూసుకుపోతున్నారు. ఉండి ఉండి చెమటలు తుడుచుకుంటున్నారు. చాలాదూరం నుంచి వస్తున్నట్లు.. మరింత దూరం పోతున్నట్లు వారి అశ్వచాలన చెబుతున్నది.

వెనగ్గా మరికొందరు పురుషులు, స్త్రీలు అశ్వాలపై వస్తున్నారు. అంతా పోయేది ఒక్క దగ్గరకే. కానీ, ఎవ్వరికీ సందేహం రాకుండా దూరదూరంగా పోతున్నారు.. ముగ్గురు నలుగురుగా. చీకట్లు బాగా ముసిరేవేళకు ఓ నగరంలోకి ప్రవేశించి.. ఓ భవనానికి కాస్త ఆవలగా చెట్ల గుబుర్ల చాటున నిలబడి ఆ భవనాన్ని చూస్తున్నారు.

‘‘అదే.. కమలాంబ వేశ్యావాటిక!’’ చూపిస్తూ చెప్పింది లలితాంబ.

అదొక శిథిలభవనంలా.. అలికిడి లేక నిశ్శబ్దంగా ఉంది. ఈ సమయంలో ఏ వేశ్యాగృహమైనా వచ్చేపోయే పల్లకీలు, రథాలతో అట్టహాసంగా వెలిగిపోతుంది. కానీ, కమలాంబ వేశ్యాగృహం ఎవరో శపించినట్లు నిశ్శబ్దాన్ని కప్పుకొని పడుకుని ఉన్నది.

‘‘అయితే నువ్వు చెప్పింది నిజమేనన్నమాట..’’ అన్నాడు జాయపుడు.

‘‘అందుకేగా మనం ఇంతదూరం వచ్చింది..’’ లలితాంబ తీక్షణంగా అటే చూస్తూ అన్నది.

ఆమె కుడిహస్తం మాటిమాటికీ నడుముకున్న పటకాలో దోపిన చురకత్తి పైకే పోతున్నది. ఆమె ఎప్పుడైనా ముందుకు దూకే ఆడచిరుతలా ఉంది.

అది పొలవాసనాడు ఆవలగా ధర్మపురి క్షేత్రానికి వెళ్లే దారిలో ఉన్న వేశ్యాగృహం. దానిని నిర్వహిస్తున్న కమలాంబ.. లలితాంబకు చెల్లెలు. పిన్ని కూతురు. అంటే.. నీలాంబ చెల్లెలి కూతురు. అయితే ఈ కమలాంబకు భర్తలాంటివాడు ఈప్రాంత మండలేశ్వరుని కుమారుడు కామితదేవుడు. అతని సహకారంతోనే కమలాంబ ఈ వేశ్యాగృహాన్ని నడుపుతున్నది. అయితే అతని ప్రత్యర్థులు కామితను దెబ్బకొట్టే తంత్రాలలో భాగంగా ఈ వేశ్యాగృహాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. నిన్నటిదినం దీనిపై దాడిచేసి కమలాంబతోసహా మహిళలందర్నీ బంధించారు. సహజంగానే కామిత వర్గం తిరిగి దాడి చేశారు కానీ, ప్రత్యర్థిదే పైచేయి అయ్యింది. కామితుణ్ని కూడా ఈ వేశ్యాగృహంలోనే బంధించి ఉంచారు.

ఈ సమాచారం ఓరుగల్లుకు చేరింది. లలితాంబ ఆగ్రహోదగ్రురాలయ్యింది. తన మహిళాసైన్యంతో కొందరు పురుషులను కలుపుకొని కదలబోయింది. అప్పుడే.. జాయపుని సహాయం అర్థించమని సలహా ఇచ్చింది నీలాంబ. లలితాంబ కోరికను జాయపుడు మన్నించాడు. ఆయుధాలు, కవచ, శిరస్త్రణాలు, ధరించి వాళ్లవెంట కదిలాడు. ఇద్దరూ మహావేగంగా వచ్చి ఆ వేశ్యాగృహం దగ్గరికి చేరారు.

వెనుక వస్తున్న లలితాంబ సైన్యం కూడా చేరింది.